# 'తలత్‌తో ఓ తడిసిన సాయంత్రం'

మళ్లీ అదే సాయంత్రం...

మళ్లీ అదే నలిపేసే దుఃఖం...

మళ్లీ అదే ఏకాంతం...

నాకు సాంత్వనగా నీ జ్ఞాపకాలు తరలివచ్చాయి – మళ్లీ!!

అర్థాంతరంగా ఆగిపోయిన మన ప్రియ సంభాషణ ఎప్పుడు తిరిగీ కొనసాగుతుందో తెలియదు. నా గమ్యం నీ గమ్యం నించీ విడిపోయిందే!! మళ్లీ!!

"ఫిర్ వొహీశ్యామ్ వొహీ గమ్ వొహీ తన్హాయి హై" సుమారు నలభై అయిదు ఏభై ఏళ్ల క్రితం 'జహాఁ ఆరాఁ' సినిమా కోసం తలత్ మహమూద్ పాడిన పాట... పై తెలుగు వాక్యాలు నేను పేలవంగా చేసిన తెలుగు అనువాదం... ఆ రోజుల్లో మొత్తం సినిమా నిర్మాణానికయ్యే ఖర్చు కేవలం తన పాటలకు పారితోషికంగా తీసుకొన్న ఘనత తలత్ మహమూద్‌ది.

సన్నగా కంపించే కంఠంతో మార్దవంతోపాటు విషాదాన్నీ నింపుకుని, కవి అనుభవిస్తూ రాసిన గీతార్థం ఇసుమంత చెడకుండా... మంచి విరుపుల్తో తలత్ పాడిన పాటలు, ఘజళ్లు, ఠుమ్రీలు జనాల్ని వెర్రెత్తిచ్చాయారోజుల్లో (ఈ రోజుకీ నాలాంటి అభిమానుల్ని పులకింపజేస్తూనే ఉన్నాయనుకోండి.)

తలత్ పరిచయం నా జీవితంలో ఓ మధురమైన అనుభూతి. తలత్ పరిచయం అంటే ఆ మధురగాయకుడితో వ్యక్తిగతంగా అనికాదు. తలత్ స్వర పరిచయమన్నమాట. నాకు మా బాషా పరిచయమయ్యే వరకూ రఫీ, కిషోర్, ముఖేష్, మన్నాడేలూ, ఆ వెనకటి వాళ్లు మల్లిక్, సైగల్, ఎస్డీబర్మన్లూ తెలుసు. నాకు తలత్‌ని పరిచయం చేసినవాడు మా బాషా (షౌకత్ అలిఖాన్) వాడు డిగ్రీ చదివేరోజుల్లో మాతో కోరి పరిచయం పెంచుకున్నాడు. అది ఈనాటికీ గాఢ స్నేహంగా వర్ధిల్లుతూనే ఉంది.

ముందు అడిగాడు 'హిందీ పాటలు వింటావా?' అని. నే వినే వాళ్లని వాడికి చెప్పాను 'తలత్‌ని వినలేదా?' అనడిగాడు. లేదన్నాను. అప్పట్లో టేప్ రికార్డర్లు అంత సులువుగా, చౌకగా లభ్యమయ్యేవి కావు. మా అప్పిగాడి దగ్గర మాత్రం పెద్ద చుట్టల

టేపుతో 'గ్రండిగ్' రికార్డురుండేది. దాన్ని తాకాలంటే భయం. మాకు పాటలన్నా సంగీతమన్నా రేడియోనే.

"ఉదయాన్నే 7.30 నించీ 8.00 గం.ల వరకూ రేడియో సిలోన్‌లో పాత సినిమా పాటలు వేస్తారు. అందులో ఖచ్చితంగా ఓ తలత్‌పాట వినొచ్చు విను" అన్నాడు బాషా... నాకా సమయంలో రేడియో వినడం కుదరేది కాదు. మరి తలత్‌ని వినేదెలా?... అప్పట్లో మా సోముగాడు తుంగభద్ర అవతల ఫ్యాక్టరీ కాలనీలో వుండేవాడు. వాణ్ణి కలవాలంటే తుంగభద్ర ఒడ్డువరకూ సైకిళ్లలో వెళ్లడం, అక్కణ్ణించీ తుంగభద్రని చిన్న తెప్ప (అరిగెల)లో దాటి అక్కణ్ణించీ ఓ అయిదు ఫర్లాంగులు నడవాలన్నమాట.

అలా ఓ సాయంత్రం వాణ్ణి కలవడానికి నేను బాషా వెళ్లివస్తున్నాం. తిరుగు తుంగభద్ర దాటాం. సైకిళ్లు తీసుకుని వస్తూండగా వాన... కుండపోతగా వర్షం.

ఓ చూరు కింద సైకిళ్లాపుకుని నిలుచున్నాం. జేబుల్లోంచి తడిసిపోయిన సిగరెట్లు తీసి వెలిగించుకుని వర్షాన్ని ఆనందిస్తున్నాం. ఉన్నట్టుండి బాషా "విను విను వినూ" అన్నాడు. ఎక్కణ్నించో రేడియో వినబడ్తోంది. ఏవో సంగీత స్వరాలు వర్ష శబ్దంతోపాటు వినిపిస్తున్నాయి. అన్ని ఇంద్రియాలూ కూడగట్టుకుని.

ఆ వర్షపు హోరులో తడిసిన సిగరెట్ కాలుస్తూ నేను మొట్టమొదటిసారి తలత్ మధురగాత్రం విన్నాను.

పాట పైన చెప్పిందే... 'ఫిర్ వొహీ శ్యాం వొహీ గమ్ వొహి తన్హా యీ హై"

ఈ రోజున స్టీరియోలూ సీడీప్లేయర్లూ ఎన్ని వచ్చినా... ఎంత స్పష్టంగా వినగలుగుతున్నా...

ఆ వర్షపు సాయంత్రం... ఆ నీటి పరదా వేసిన చూరు కింద నించుని

తడిసిన సిగరెట్ కాలుస్తూ... వర్ష శబ్దపు హోరుతో జమిలిగా నేవిన్న తలత్ పాట ఆ మరణాంతం గుర్తుండిపోయే మధురానుభూతి.

మళ్లీ అదే సాయంత్రం... మళ్లీ అదే మెలివేసే దుఃఖం... మళ్లీ అదే ఏకాంతం..

నాకు సాంత్వనగా నీ జ్ఞాపకాలు తరలివచ్చాయి.

తలత్! నీ జ్ఞాపకాలే...

✳ ✳ ✳

యాంత్రికత్వం మనలోని సున్నితత్వాన్ని కరకుగా చెరిపేస్తూన్న నేటి జీవన నేపథ్యంలో, మంచి సంగీత సాహిత్యాల అవసరం ఎంతైనా ఉంది. ●